# EMOTIONAL

# అయినా గెలవాల్సిందే

డా॥ వాసిలి వసంతకుమార్



# INTELLIGENCE

లైఫ్ ఈజ్ ఎమోషనల్

అయినా

# గెలవాల్సిందే

డా॥ వాసిలి వసంతకుమార్



SUCCESS BY EMOTIONS

A BOOK FROM YOGAALAYA RESEARCH CENTRE

*Life is Emotional*

# AYINAA GELAVAALSINDE

*Success by Emotions*

*by*

**Dr. VAASILI VASANTA KUMAR**

**M.A., Ph.D.,**

First Edition : July, 2013

© Dr. Vaasili Vasanta Kumar

*No part of this book is transformed into any form without the permission of the author*

**Price : Rs. 100/-**

Published by

**YOGAALAYA**

Plot 90, Krishna Enclave, Military Dairy Farm Road,
Trimulgherry, SECUNDERABAD - 500 015.
Cell : 93 93 93 39 46
E-mail : drvaasili@yahoo.co.in
www. yogaalaya.org www.yogalaya.in

Title Designed by
Pavan Kumar Vemuri
(Samantha Graphics)

---

All the articles are serialized in ANDHRA BHOOMI Daily AADIVAARAM

అమ్మకు ...



**శ్రీమతి వాసిలి యామినీదేవి**

MOTHERHOOD - an eternal emotion
అద్వితీయ భావోద్వేగం అమ్మతనం 6

POSITIVE THOUGHTS - emotional success
మనసుకే అనేక తలపుల తలుపులు 10

NEGATIVE THOUGHTS - emotional illness
దూషణలన్నీ మనసులోని చీకటికోణాలే! 16

FEAR - feelings of helplessness
భయాన్ని విస్మరించగలిగితే బ్రతుకంతా విస్తరణే! 21

GRANDIOSITY - fishing for compliments
అభిమానధనులకు అభినందన లెందుకు? 27

DESIRE - lead to take actions at all times
కోరిక బలమైనదైతేనే లక్ష్యం స్వంతం 31

FAILURE - to do something extraordinarily
ప్రత్యేకం కాలేకపోతే అపజయమే! 34

JEALOUSY - cancer to the mind
అసూయకు మనస్సే పుట్టిల్లు, మెట్టినిల్లు 37

SELF ESTEEM - hidden image versus projected image
మనసు గీసిన చిత్రమే! అయినా ... 41

ANGER & JEALOUSY - an emotional punishment
కోపతాపాలతో మనల్ని మనమే శిక్షించుకుంటున్నాం 45

WORRY - paying interest for troubles
ఆశీర్వదించినా ఆందోళనా?! 49

FAITH - a response to moderate challenge
విశ్వసించకపోతే నిత్యాందోళనే! 53

WORRYING POSITIVELY - attracting the future
కొంత ఆందోళనతో మరిన్ని అవకాశాలు 57

CHEATING - hurt you in the end
మోసాలు, మోహాలు మనల్ని కాకుండా చేస్తాయి! 61

LOVE AND LUST - slipping into the danger zone
కలసిన తనువులలో కలవని తలపులు 66

LOVE - single soul in two bodies
ప్రేమంటే ... మనసును తీర్చిదిద్దే జీవకళ 70

DEPRESSION - hopeless feelings can be adjusted
నిరాశ ... నిలువెత్తు ప్రతిబింబం కాకూడదు! 75

CHARITY - share the good and desirable
పంచగలిగితే పెరగగలం! 82

EMOTIONAL INTELLIGENCE - impact of thoughts
మనసు ... మనిషి _ మతి ... గతి _ ఇంతే! 87

HUMAN EMOTION - reacting without thinking
భావోద్వేగాలే మన బలగాలు 91

DEVOTION - receptivity according to capacity
భక్తిప్రపత్తులూ భావోద్వేగాలే! 96

MEDITATION - appreciating the life and living
ఈదేహం ఉద్వేగసంపన్న అమృతకలశం 101

COMPASSION - need to create more smiles
అస్తిత్వమూలాలు మానవత్వ ప్రతీకలు కావాలి! 106

SELF COMPASSION - kindness and charity
ఆర్ద్రతకు ఆచరణ తోడు కావాలి! 109

PERSONAL COMMITMENT - healthy option
మాట చేతల అదృశ్యమైత్రి 113

TEAM COMMITMENT - must be made or re-made
సహపంక్తికి సంపూర్ణ సమ్మతి 117

SPIRITUAL COMMITMENT - persistence with a purpose
అంతర్యానానికి త్రికరణ రచన 120

MIDDLE DROP - an emotional accident ... not an end
అవసరానికే మిడిల్ డ్రాప్ ... జీవితం కొనసాగాల్సిందే! 124




MOTHERHOOD

an eternal emotion

# అద్వితీయ భావోద్వేగం అమ్మతనం

*అమ్మ మన అడుగుల సవ్వడి మధ్య తాను నిశ్శబ్దంగా*
*అడుగులేస్తుంటుంది. ఆ నిశ్శబ్దాన్ని వినగలిగే 'తీరిక' మనకు ఉంటే*
*అమ్మ అస్తిత్వం మన చుట్టూ పారాడుతుంటుంది.*
*ఇలా అమ్మతనమే అమృత కలశం అయినపుడు 'అమ్మ'కు*
*అర్థం 'అనంత'మే కదా! అమ్మ విలువా 'అమూల్య'మే!*
*అమ్మ బంధానికి మొదలు ఉంటుందే తప్ప అంతం అంటూ ఉండదు.*

అమ్మ కొంగుచాటున పాలుతాగుతూ మనలో కలిగే జీవ చైతన్యాన్ని, అమ్మ పొందే పేగుబంధ తాదాత్మ్యాన్ని ఏ ప్రపంచభాషా తన అక్షరాభ్యాసంతో వందశాతం ఆవిష్కరించలేకపోతోంది. చివరకు పాలిచ్చిన అమ్మకూ మాటలు కరువవుతుంటాయి ... పాలుతాగిన మనమూ మూగపోతుంటాం. అయితే ఇద్దరి భాషా 'తల్లీ - పిల్ల'ల వరకే పరిమితం. ఆ పరిమితిలో ఏ భాషా పదాలన్నా సమానార్థకాలనిపిస్తాయే తప్ప అసలు పదబంధం ఆ పేగుబంధాలకే స్వంతం.

బుడి బుడి అడుగులేస్తూ అమ్మ చిటికెన వేలిని మన గుప్పిట్లో బంధించేసి అమ్మతనాన్ని మన రక్షాకవచం చేసుకుంటాం ... ఇంకా చెప్పాలంటే అమ్మ వేలిని దొరకబుచ్చుకుని ప్రపంచం మన గుప్పెట్లో ఉందనుకుని సంబరపడిపోతాం. అంటే అమ్మ కొండంత అండ అన్న భావన చిరుప్రాయంలోనే మనలో పాదుకుపోతుందన్నమాట. నాటి నుండి తెలిసి చేసినా, తెలియక చేసినా - మన ప్రతి చేష్టనూ ప్రశాంతంగా అవలోకించే అమ్మతనాన్ని జీవన పాత్రలో ఎంతని నింపగలం. చేదుతున్న కొద్దీ అనంతంగా ఊరుతూనే ఉంటుంది. అలా అమ్మతనం ఎప్పటికీ ఒక సజీవ స్రవంతే. మనలోని

కల్మషాలు, కశ్మలాలు ఆ ప్రవాహంలో కొట్టుకుపోతూ 'అమ్మతనం' మాత్రమే ప్రవాహ సదృశ మవుతుంటుంది. ఆ అమ్మతనాన్ని ముద్దిడినా, ఆ ప్రవాహ కేశాల్ని తడిమినా ఆ తుంపరలతో తనువు పులకిస్తుంది. ఆ పులికింతతో మనం అమ్మగానో, నాన్నగానో అమ్మతనానికి ప్రతిబింబాలం అవుతాం ... సృష్టికర్తలం అవుతుంటాం.

## ఏడేడు తరాల మాతృగర్భ

అటు ఏడుతరాల ఇటు ఏడుతరాల మాతృగర్భ అమ్మ. తరతరాల అల్లుకుపోయిన కుటుంబ వ్యవస్థలో అమ్మ ఓ సాలీడు. అమ్మతనంతో అల్లుకుపోతూ ... పోతూ ... ఒక విశాల కుటుంబాన్ని ఏర్పరచుకుంటుంది. ఆ కుటుంబ నిర్మితి, వినిర్మితి అంతా అమ్మదే! అక్కడ అమ్మది ఏకతా రాగంలా అనిపించే ఐక్యతా రాగం. ఆ రాణివాసంలో అమ్మది బహుముఖీన ప్రజ్ఞ. ఇంకా చెప్పాలంటే కుటుంబ క్షేత్రంలో రకరకాల ఫలవృక్షాలను పెంచగల తోటమాలి అమ్మ. ఆ సస్యశ్యామల క్షేత్రంలోని అన్ని ఫలజాతులకు అందేది ఆ అమ్మతనమే. అయినా ఫల ఫలితాలు వేరు వేరు. రంగులు వేరు. రుచులు వేరు. అయినా అన్నింటి రంగూ రుచీ వాసనలు ఆ అమ్మతనం నుండి జాలువారినవే. కాబట్టి ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా కుటుంబ బాధ్యత అంతా అమ్మదే! కుటుంబం పైని ప్రభావం అమ్మదే! అలా కుటుంబానికే అంకితమైపోయిన అమ్మ ఏ షిఫ్ట్ సిస్టమ్‌లోనూ ఇమడ లేదు. తానే ఓ కాల్ సెంటర్‌లా వ్యవహరిస్తుంది. ఆనందంగా అమ్మా అన్నా, బాధగా అమ్మా అన్నా ఏ ఇన్‌స్ట్రుమెంట్ లేకుండానే మన పిలుపు వినగలదు. పేగుబంధమే పిలుపుని చేరేస్తుంది. అలా అమ్మ బాధ్యతలకు ఎప్పటికీ తాళాలు పడవు ... గడియ పడని తలుపులు అమ్మ తలపులు ... షి ఈజ్ సో రెస్పాన్సిబిల్ అండ్ రెస్పాన్సివ్. 'అమ్మ'గా బాధ్యత ప్రత్యక్షంగా తను జీవించి ఉన్నంత వరకే కావచ్చు కానీ 'అమ్మతనం' మనం జీవించి ఉన్నంత కాలం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మనపై ప్రభావం చూపుతుంటుంది.

కుటుంబ వ్యవస్థలో అమ్మకు బాధ్యత ఎక్కువా? నాన్నకు బాధ్యత ఎక్కువా? అంటే అమ్మకే బాధ్యతల బరువు అధికం అని చెప్పాల్సి ఉంటుంది. పిల్లల పెంపకం విషయంలో తండ్రి తనకు తెలీకుండానే కొన్ని పరిమితులకు లోబడి ఉంటాడు. ఆ రేఖను దాటకుండా కుటుంబ పెద్దగా వ్యవహరిస్తుంటాడు. బాధ్యత పేరుతో ఆ రేఖ దాటే సాహసం చేయడు. కానీ పిల్లల విషయంలో తల్లి తాను గీసుకున్న గీతను తానే చెరిపేసుకోగలదు. అవసరానికి తల్లీ, తండ్రీ తానే కాగలదు. అదీ అమ్మతనంలోని కమ్మదనం. అలా అమ్మది ఫుల్‌టైమ్ రెస్పాన్సిబిలిటీ ప్లస్ లైఫ్‌లాంగ్ రెస్పాన్సిబిలిటీ

అవుతుంటుంది. 'అమ్మే కావాలి... నాన్న కొట్టినా అమ్మే కావాలి' అని మనం అనుకోవటానికి కారణం అమ్మతనంలోని ఆ కమ్మదనమే. జీవితంలో వచ్చి చేరే బంధాలు, అనుబంధాలు, ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు, అన్యోన్యతలు - వీటన్నింటి అమృత కలశం అమ్మతనం. అమృతం రుచిచూసిన వారికి మృతతత్వం దరికి చేరదన్నట్లుగా అమ్మతనం ఆరగించిన వారికి చిత్తచాంచల్యం కలగదు. పైగా మానసికంగా, శారీరకంగా ఆత్మస్థైర్యం కలిగేది అమ్మతనంతోనే. అటువంటి అమ్మతనాన్ని ఆడతనం అనుకుంటే అది మన పొరపాటే ... అది మన సంకుచిత ఆలోచనా ధోరణే. ఇక్కడ అమ్మ అంటే ఫెమినిటీ + ఫిమేల్ రోల్ మోడల్ + ఫిమేల్ అడల్ట్. ఈ సంగమ ఫలితంగానే కుటుంబాన్నీ, సమాజాన్నీ, ప్రపంచాన్నీ అవగతం చేసుకోగలదు. స్త్రీ పురుషుల మధ్య ఉన్న అంతరాన్ని చెరిపేయగలదు. పైగా స్త్రీ పురుషుల మధ్య నెలకొనే ప్రేమబంధాన్ని కుటుంబ వ్యవస్థగా రూపొందించగలదు. తన తరువాతి తరాలకు సంస్కృతీ సంప్రదాయాలను, ప్రజ్ఞా పాటవాలను అందించగలదు.

## సహస్రదళకు సహస్రార్చనా?

'అమ్మ'కు సంపూర్ణార్థం ఏ నిఘంటువులోనూ దొరకదు. దొరికినా అది పద బంధాల మధ్య దాక్కున్న అర్థం అవుతుందే తప్ప పెద బంధాల మధ్య విరబూసిన అర్థం కాదు. అయితే మాటలకు అందని అమ్మ మన జీవితంలో జరిగే ప్రతీ సంఘటనలోను, ప్రతీ సందర్భంలోను 'అర్థవంత'మవుతూనే ఉంటుంది. అమ్మ మన అడుగుల సవ్వడి మధ్య తాను నిశ్శబ్దంగా అడుగులేస్తుంటుంది. ఆ నిశ్శబ్దాన్ని వినగలిగే 'తీరిక' మనకు ఉంటే అమ్మ అస్తిత్వం మన చుట్టూ పారాడుతుంటుంది. ఇలా అమ్మతనమే అమృత కలశం అయినపుడు 'అమ్మ'కు అర్థం 'అనంత'మే కదా! అమ్మ విలువా 'అమూల్య'మే! ఇంకా చెప్పాలంటే అమ్మ బంధానికి మొదలు ఉంటుందే తప్ప అంతం అంటూ ఉండదు.

పుడమిని తొలిసారిగా ముద్దిడి గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్న పసికందును వొళ్లంతా కళ్లింతలు చేసుకుని పురిటి బాధను మరచి చూసుకుంటున్న అమ్మను 'సహనశీలి' అనాలా? అనుక్షణం ప్రేమగా చూసుకుంటూ, అనురాగ పందిరి వేసే అమ్మను 'ప్రేమమూర్తి' 'అనురాగ సంపన్న' అని సరిపుచ్చుకుందామా? కంటికి రెప్పలా, వెన్నంటి ఉండే అమ్మను 'రక్షకురాలు' అంటే తనివి తీరుతుందా? ఎల్లవేళలా క్రమశిక్షణను నేర్పే అమ్మను ఏ పదబంధాల మధ్య సేద తీర్చాలి? సన్నిహితంగా మిత్రత్వాన్ని పెంచే అమ్మను ఏ స్నేహితునితో సమతూకం వేయాలి? తనను మరచి మన కోసం తపించే అమ్మను

'నిస్వార్థ' జీవి అంటూ కర్పూర నీరాజనం చేయాలా? అసలు ఇన్ని రకాలుగా సహస్రదళ మయిన అమ్మకు సహస్ర నామార్చన అవసరమా? లక్ష కుంకుమార్చన అవసరమా? అమ్మ మన నుండి కోరుకునేది పూజా సుమాలను కాదు. 'కృతజ్ఞత'ను కూడదీసుకోమని కాదు ... మన కళ్లలో దోగాడే ప్రేమను, ఆప్యాయతను, మన తోబుట్టువులతో కలిసి మెలిసి ఉండే వర్తనాన్ని. ఇటువంటి వర్తమానాన్నే అమ్మ మన నుండి కళ్లింతలు చేసుకుని కలలు కంటుంటుంది. అవి పగటి కలలు కాకూడదని, వాస్తవ జీవన చిత్రాలు కావాలని 'అమ్మతనం' ఆశిస్తే వాటికి మనం ప్రతిబింబాలం కాలేమా?

ఏది ఏమైనా – "Taking the time and energy to take care of another human being and ensure that she grows up to be competent and healthy enough to have a family of her own one day "- అదీ అమ్మతనంలోని సృష్టి రహస్యం.






# మనసుకే అనేక తలపుల తలుపులు

*దేహం ఉన్నంత కాలం భౌతిక ప్రపంచాన్ని కాదనలేం.*
*పదార్థ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే దేహానికి మనసు తోడు కావలసిందే!*
*ఈ ప్రపంచంలో మన అస్తిత్వం నిరూపితం కావాలంటే,*
*మన వ్యక్తిత్వం పరిమళించాలంటే దేహం, మనసులతో మనదైన*
*ప్రవృత్తికి మైత్రి ఏర్పడవలసిందే! ఈ మూడింటి సాంగత్యంతోనే*
*భూ వలయంలో మనలది మైండ్‌ఫుల్ లివింగ్ అవుతుంది.*

తల్లి గర్భం నుండి ఒకే తలతో మానవాకృతితో భౌతికానికి వచ్చిన మనం దేహపరంగా పెరుగుతూ పెరుగుతూ మానసికంగానూ ఎదుగుతూ ఎదుగుతూ అనేక తలపుల తలుపులను బిగించుకుని ఊపిరాడక అలమటిస్తున్నాం. దేహం ఒక్కటే ... మనసే అనేకాల సంగమం. అందుకే మన మానవ జీవితమూ క్రాస్‌రోడ్స్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అవుతోంది. ఆ కూడలిలో మన ఆలోచనలన్నీ బిజీ ట్రాఫిక్‌ని తలపిస్తూనే ఉంటాయి ... భయపెడుతూనే ఉంటాయి. భయం వెన్నంటి ఉండటంతో మనవి బిత్తర చూపులు అవుతున్నాయి. చూసి, చూసి మన జీవితమూ జామ్ అవుతుంటుంది.

ఈ నేపథ్యంలో – ప్రళయం ముంచుకొస్తోంది ... ముందుకొస్తోంది. ప్రపంచం మునిగిపోతుంది. సకల జీవరాశి నామరూపాల్లేకుండా కొట్టుకుపోతుంది. ఏ ఒక్కరూ మిగలరు. ఏ ప్రాణీ మిగలదు – ఇలా ఈమధ్య తరచు కురుస్తున్న మాటల తుఫాన్ ... భయం సృష్టిస్తున్న సునామీలు ... పాలుపోక భయం గుప్పిట పూజలు, హోమాలు, యాగాలు, తపాలు. ఈ గండం నుండి బయటపడేందుకు శతవిధ ప్రయత్నాలు.

ఏదీ లేకుండా పోతుందనుకున్నపుడు ఈ తపన ఎందుకు? సృష్టి రహస్యం తెలుసుకోగలిగితే ఈ తలపడటం ఉండదు! ప్రకృతి వేదనను తెలుసుకోగలిగితే –

ఆవేదనను అర్థం చేసుకోగలిగితే – ఏ విఘాతాలకు మనం ముందుకు ఉరకం. అవిఘ్నమస్తు అంటూ ప్రకృతికి తిలకం దిద్దం.

ఇటువంటి ఉరుకులు పరుగులకు కారణం మనం 'నాది' అనుకుంటున్నాం కాబట్టి ... నాదికి మనసును జత కలుపుతున్నాం కాబట్టి. ఇలా ప్రాపంచికమైనదే మానసికమూ అయిపోతోంది. ఈ ప్రపంచమే మనసు అయిపోతోంది. నిజానికి మన జీవితమే ఒక సుడిగుండం ... మనకు తెలీకుండానే ఈ సుడిగుండంలో చిక్కుకు పోతుంటాం. అందుకే భయాందోళనలు మనల్ని పట్టి కుదిపేస్తుంటాయి.

అసలు సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు. చావు పుటుకలు పరిణామ రహస్యాలు. దృశ్య అదృశ్యాలు చీకటి వెలుగుల వంటివి. ఒకదాని వెంట మరొకటి పడుతుంటుంది. అదే కాల భ్రమణం ... సృష్టి పరిణామం. అంతెందుకు కొత్త సంవత్సరం అని మనం సంబరపడుతుండగానే కాలెండర్‌లో కాగితం తిప్పాల్సి వస్తుంది. నెల గడిచి మరోనెల పొడుచుకొస్తుంది. రోజుల్ని లెక్కిస్తుండగానే నెలలు గడిచిపోతాయి ... మరో సంవత్సరం ముందుకొస్తుంది. ఓ సంవత్సరం గడిచిపోతుంది. ఆ ఏడాదిలో పుట్టుకొచ్చిన కొన్ని సంఘటనలు గతించిపోతాయి. అవి వైభవాలో తెలియదు ... వైభోగాలో తెలియదు ... గతం తాలూకు అనుభవాలో, కాలం మరకలో తెలియదు. తెలియనితనంతోనే తెలిసినట్టుగా వర్తమానం గడిచిపోతుంటుంది. గడిచిపోయింది గతించీ పోతుంది.

సృష్టిలో ఏ ప్రాణీ శాశ్వతం కాదు. రాయి రప్పా సైతం కరిగిపోతుంటాయి. పెరిగే ప్రతీదీ తరిగిపోయేదే. సజీవాలనిపించినవీ నిర్జీవాలయిపోతుంటాయి. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన దేవాలయాలు, ప్రాణం పోసుకున్న దేహాలు సైతం కాలంలో కలిసిపోతుంటాయి. ఇలా మరణం మనిషికి, ప్రళయం ప్రపంచానికి సహజం. పుట్టిన మనం ఏదో ఒకనాడు మరణ మృదంగాన్ని వినక తప్పదు ... పురుడుపోసుకున్న పుడమి ప్రళయ భీభత్సాన్ని చవిచూడకా తప్పదు.

కాలెండర్‌కి వయసు మూడు వందల అరవై అయిదు రోజులు ... పుట్టిన మనకూ సంపూర్ణ ఆయుర్దాయం వందేళ్లు. అయినా పన్నెండాకుల కాలెండర్‌లో కొన్ని కాగితాలు నలిగిపోవటమో, చిరిగిపోవటమో లేదా కాగితాలపై అక్షరాలు అలుక్కు పోవటమో జరుగుతుంటుంది. ఇలాగే కొన్ని మానవ పుట్టుకలూ అర్థాయుష్కాలే! అయినా కాల చక్రంలో మరో కాలెండర్ ముద్రింపబడుతుంది. మానవ మనుగడలో మరో శిశువు పురిటి మంచం నుండి ఉయ్యాలబల్లను చేరుతుంది. ఉరకలెత్తే సముద్రమూ చల్ల

బడుతుంది. జడివాన సైతం పెనుతుఫాన్ అవుతుంది. పచ్చటి ఆకులు ఎండుటాకులు అవుతుంటాయి. సువాసన వెదజల్లిన పుష్పాలు మట్టిలో కలిసిపోతుంటాయి.

ఎండుటాకులు, రాలినపూలు, మట్టివాసనలు మరోసృష్టికి శ్రీకారం చుడతాయి. దేహం కృశించి, మరణ శయ్యను చేరినా మరో అవతరణకు భూమిక సిద్ధమయ్యే తీరుతుంది. ఇటువంటి మనస్తత్వంతో మరణించినవారి కోసం బాధను దిగమింగు కుంటున్నా మరో జన్మ ప్రాప్తించే తీరుతుందని ఊరడిల్లుతాం. ఆ జన్మ మానవజన్మ అయి వుంటుందని విశ్వసిస్తూ 'పునరపి మరణం ... పునరపి జననం' అన్న మనస్తత్వానికి, తత్వానికి కట్టుబడిపోతాం. ఉదయించిన సూర్యుడు అస్తమించటం లేదూ! అస్తమించిన సూర్యుడు మరునాడు ఉదయించకాపోడు. మనమూ అంతే! ఈ జన్మలో మనది మానవపుటక అయినట్లు మరో జన్మలో మరో పుట్టుక కావచ్చే కానీ మానవ అవతరణే అవుతుందన్న గారంటీ లేదు.

అంతెందుకు ... మనకంటూ ఒక కుటుంబం, ఒక సమాజం, ఒక ప్రపంచం ఉంది. కొన్ని వందల మంది తెలిసి ఉంటారు. అయినా మనం పరిమిత వ్యక్తులతోనే సంబంధ బాంధవ్యాలను కొనసాగిస్తాం ... కొందరితోనే రాకపోకలు సాగిస్తాం ... అలాగే మనమూ సందర్శించిన స్థలాన్నే మళ్లీ సందర్శించాలని అనుకోం. ఎంతలా ఇష్టపడ్డా మరోసారి లేదా రెండు మూడు మార్లు చూస్తాం. మళ్లీ 'నేను' మానవజన్మకు రావటమూ ఇంతే! ఎంతో ఇష్టపడితే తప్ప మరుజన్మ మానవజన్మ కాదు.

వర్తమాన ఆవరణలో 'నాది' మానవదేహ ఆచ్ఛాదన. మరో జన్మలో మానవేతర దేహ ఆచ్ఛాదన కావచ్చు. ఈ కామన్‌సెన్స్ ఉంటే మనం మైండ్‌ఫుల్‌గా ఉన్నట్లే! మనం ప్రకృతిబద్ధం కాగలిగితే మన మనసు మొక్కుబడుల వెంట పడదు.

మైండ్‌ఫుల్ లివింగ్‌తో మనల్ని వేధించే ప్రశ్న మానవజన్మ ప్రయోజనం ఏమిటి? అని. మన ప్రయోజనాన్ని నిర్వచించేది ఎవరు? నిర్ణయించేది వేరొకరు అయితే నిర్వహించేది మాత్రమే మనమా? లేదా నిర్ణయమూ మనదే, నిర్వహణా మనదేనా? అసలింతకీ మనం ఎందుకు ఈ మానవాకృతిలో ఉన్నట్లు? మానవ పుట్టుకతో మనం నిర్వహించవలసిన కార్యక్రమం ఏమిటి? మానవ జీవితంలో వేసే ప్రతీ అడుగుకూ కర్తా కర్మా క్రియా మనమే అయినపుడు ఏ రాద్ధాంతమూ లేదు ... కాని మనల్ని శాసించేది మరొకరు అయినపుడు అంతా గందరగోళమే! అంతటా అన్యమనస్కతే!

చిన్నతనంలో తల్లితండ్రులు మనపై పెత్తనం, ప్రభావం చూపటానికి ప్రయత్నించటం సహజమే. ఆ వయసుకు అది నప్పుతుంది కూడా! కానీ తెలివితేటలు పెరిగి, స్వేచ్ఛగా ఎదగటానికి హద్దులు పరిధులు లేవని తెలిసిన తర్వాత కూడా మన మానాన మనని ఉండనివ్వని పెద్దలపై కోపతాపాలు పెరగటమూ సహజమే. అలాగే చదువు సంధ్యలపుడు స్నేహితులు ... మిత్రత్వం అక్కడివరకే. సంపాదనాపరులమైన తర్వాత కూడా అదే మిత్రులు మనపై ఆధిపత్యం చెలాయిస్తా మంటే సహించలేం.

చివరికి ఆధ్యాత్మికంగా సైతం – దేవుడు సైతం మనకు అనుకూలంగా ఉండాలి ... మనకు నచ్చిన వేషభూషణాలతో ఉండాలి ... మనకు తెలిసిన భాషలో మన మొర ఆలకించేవాడై ఉండాలి ... అప్పుడే ఆ భగవంతుడిపై గురి కుదురుతుంది. మనలోని ప్రతిఒక్కరికి నచ్చని దేవుళ్లు కొందరుంటారు. మనస్ఫూర్తిగా నమస్కరించే దేవతలు కొందరైతే, మనస్కరించకపోయినా మొక్కుబడిగా, భయపడుతూ భయపడుతూ భక్తిని నటిస్తూ నమస్కరించే దేవతలు మనలోని ప్రతిఒక్కరికీ ఉండనే ఉన్నారు. చివరికి దేవాలయాలకు సైతం మనకు నచ్చితేనే వెళ్తాం ... ఆశ్రమాలకైనా, మరో ఆధ్యాత్మిక కేంద్రానికైనా మన అడుగులు పడాలంటే మన హృదయం అంగీకరించి తీరాల్సిందే! అక్కడ మనస్తృప్తిగా అనిపిస్తేనే మరోమారు వెళ్తాం ... లేకపోతే ఇంతే సంగతులు.

ఇంతటి ఆలోచనలకు, వర్తనానికి కారణం జీవితం అర్థవంతంగా ఉండాలనే! అర్థవంతంగా జీవించాలనే! మనదైన పంథాలో బ్రతకాలనే! అయినా మనం జీవిస్తున్న ప్రపంచ ప్రభావం మనపై ఎంతో ఉంటుంది. ఆ ప్రభావాలు మనపై పెత్తనం చేయాలనుకుంటున్నందువల్ల మన స్వభావం వ్యతిరేకిస్తోంది. ఇలా స్వభావ ప్రభావాలు తూర్పు పడమరలు అవుతున్నాయి. అసలు మనం పుట్టిన ఏడాదిన్నర నుండి రెండేళ్ల వరకు అంటే దాదాపు పసితనంలోని ఆ ఆర్నెలలు మన భవిష్య వర్తనానికి భూమిక అవుతుంటాయి.

మనం చెట్టంత అయి వడివడిగా వయసుతో పాటు అడుగులేస్తున్నా ఇంతటి చెట్టుకూ వేర్లు ఆ ఆర్నెలలలోనే ఉంటాయి. ఆ వేర్లు పైకి కనిపించవు. అయినా చెట్టు మాత్రం అందర్నీ ఆకర్షిస్తూనే ఉంటుంది. ఆ చెట్టుకు కావలసిన ఆహారం అందేది ఈ వేర్ల నుండే. చెట్టు పచ్చగా ఉండటానికి కారణమూ ఆ వేర్లే. చెట్ల కొమ్మలు, రెమ్మలు, ఆకులు బాహ్య వాతావరణానికి కదులుతూనే ఉంటాయి. వీస్తున్న గాలి అది తన ప్రభావమే అనుకుంటుంది. సరిగ్గా ఇటువంటిదే మన విషయంలో ఇతరుల ప్రభావమూను.

# End of Preview.

# Rest of the book can be read @

**http://kinige.com/kbook.php?id=2381**

* * *

**Read other books of Dr. Vaasili Vasanta Kumar @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Dr+Vaasili+Vasanta+Kumar&id=886**